జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
గురువారం 25 జూన్ 2026 పేజీలు : 8



# బోగస్ ప్రకటనలతో బిజెపి నేతలు మోసం



# ఐక్య పోరాటమా ? ఒంటరి పోరుబాటా ?




సింగరేణి కార్మికుల్లో ఆశలు రేకెత్తిస్తున్న జేబీసీసీఐ--12, ఉద్యమాలు చాలా ఏళ్ల తర్వాత జాతీయ సంఘాలు ఒకటే అవుతున్నాయి.

12వ వేతన ఒప్పందం అమలతోపాటు, సింగరేణి సంస్థలు నెలకొన్న అపరిత సమస్యలపై, సింగరేణి పరిరక్షణ కోసం సమరానికి సై అంటున్నాయి.

జూలై 1 లోగా అమీ -- తుమీ తీల్చుకోవాలని సిద్ధమవుతున్నాయి.

మరో జాతీయ కార్మిక సంఘమైన బి ఎం ఎస్ మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా వైద్యాధి కారులను ఆదేశించారు. బుధవారం స్థానిక రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, ఈఎన్‌టీ, యూరాలజీ, డ్రగ్స్, ఈసీజీ ఇతర విభాగాలను సందర్శించి, అనంతరం ఆసుపత్రి కి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి ఎక్స్రే, ఈసీజీ పరీక్షల సేవలపై ఆరా తీశారు.

## డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతామని

# సంతకాల సేకరణ




ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతామని ఏ ర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో "వాల్ ఆఫ్ ప్రామి స్"లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొని సంతకం చేశారు. గంజాయికి దూరంగా ఉండాలని, గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణానికి కృషి చేస్తానని తన ప్రతిజ్ఞను నమోదు చేశారు.



# సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు సమగ్ర ఆరోగ్య భీమా

కాలానుగుణ అవసరం



**మంచిర్యాల, 24, జూన్ (ప్రజాజ్యోతి):** దేశ పారిశ్రామిక అభివృద్ధికి పునాది వేసిన సింగరేణి సంస్థలో దశాబ్దాల పాటు కష్టపడి పనిచేసిన వేలాది మంది ఉద్యోగులు నేడు విశ్రాంత జీవితాన్ని గడుపుతున్నారు. తమ యవ్వనాన్ని, ఆరోగ్యాన్ని, శ్రమను సంస్థ అభివృద్ధికి అంకితం చేసిన ఈ ఉద్యోగులకు గౌరవప్రదమైన ఆరోగ్య భద్రత కల్పించడం సంస్థ నైతిక బాధ్యత. ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు సీపీఆర్ఎంఎస్ (కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్ మెడికేర్ స్కీం) పథకం ద్వారా వైద్య సదుపాయాలు అందుతున్నాయి. అయితే ఈ పథకం కింద జీవితాంతం కేవలం రూ. 8 లక్షల వరకు మాత్రమే వైద్య ఖర్చులను భరిస్తారు. ఈ పరిమితి ఒకసారి పూర్తిగా వినియోగించబడితే, సాధారణ పరిస్థితుల్లో ఆ ఉద్యోగి లేదా వారి జీవిత భాగస్వామికి ఇకపై వైద్య సౌకర్యం అందదు. వృద్ధాప్యంలో వ్యాధులు ఎక్కువగా వచ్చే సమయంలో ఇలాంటి పరిస్థితి ఎదురైతే వారి జీవితం ఎలా సాగాలి? వారి వైద్య ఖర్చులను ఎవరు భరించాలి? అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి. నిజమే, కొన్ని గుర్తించబడిన తీవ్రమైన వ్యాధులకు పరిమితి లేకుండా చికిత్స అందించే నిబంధనలు ఉన్నప్పటికీ, మిగిలిన అనేక సాధారణ, దీర్ఘకాలిక మరియు అత్యవసర వ్యాధుల చికిత్సకు ఈ జీవితకాల పరిమితి వర్తిస్తుంది. నేటి వైద్య రంగంలో ఒకే గుండె శస్త్రచికిత్స, క్యాన్సర్ చికిత్స, కిడ్నీ సంబంధిత వ్యాధులు లేదా ఇతర ప్రధాన శస్త్రచికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రూ. 8 లక్షల జీవితకాల పరిమితి చాలా తక్కువ. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం లో ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబ సభ్యులకు ఔట్‌పేషంట్, ఇన్‌పేషంట్ వైద్య సేవలపై ఇలాంటి జీవితకాల పరిమితి లేదు. అవసరమైన మేరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ విధానం వల్ల వృద్ధాప్యంలో కూడా ఆరోగ్య భద్రతపై వారికి నమ్మకం ఉంటుంది. సింగరేణి వంటి దేశంలోనే ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ కూడా తన విశ్రాంత ఉద్యోగుల కోసం ఇలాంటి ఆధునిక, సమగ్ర వైద్య విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రముఖ ఆరోగ్య భీమా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని, అధిక బీమా పరిమితి లేదా పరిమితి లేని గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం ద్వారా వేలాది మంది విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబాలకు నిజమైన భరోసా లభిస్తుంది. సంస్థ అభివృద్ధికి జీవితాంతం శ్రమించిన ఉద్యోగి, వృద్ధాప్యంలో వైద్య ఖర్చుల భయంతో జీవించాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. ఉద్యోగంలో ఉన్నప్పుడు సంస్థ కోసం అహర్నిశలు శ్రమించిన వారికి, విశ్రాంతి అనంతరం ఆరోగ్య భద్రత కల్పించడం సంక్షేమ చర్య మాత్రమే కాదు---అది సంస్థ కృతజ్ఞతకు ప్రతీక. అందువల్ల సింగరేణి యాజమాన్యం ప్రస్తుత సీపీఆర్ఎంఎస్ పథకాన్ని సమగ్రంగా సమీక్షించి, జీవితకాల రూ. 8 లక్షల పరిమితిని గణనీయంగా పెంచడం లేదా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) తరహాలో పరిమితి లేని వైద్య సేవలు లేదా అదనపు సమగ్ర ఆరోగ్య భీమా పథకాన్ని అమలు చేయడం అత్యవసరమని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, అసోసియేషన్ సభ్యులు మహ్మద్ రఫీక్ అహ్మద్ లు తెలిపారు.

# పోలీస్ సిబ్బందికి రెయిన్‌కోట్లు అందజేసిన పోలీస్ కమిషనర్



**మంచిర్యాల, 24, జూన్ (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విధి నిర్వహణలో ఉపయోగపడే రెయిన్‌కోట్లను బుధవారం పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎండనకా, వాననకా రాత్రింబవళ్లు కష్టపడి విధులు నిర్వహించే సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రెయిన్‌కోట్లు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, మల్లేశం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సుర్జాపూర్ లో ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం






**ఖానాపూర్ జూన్ 24 (ప్రజా జ్యోతి)** ప్రాణాంతకమైన వ్యాధి క్యాన్సర్ పై ప్రత్యేక పరీక్షల ఉచిత శిబిరాన్ని కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం లోని సుజాపూర్ లో ఈనెల 28 ఆదివారం నిర్వహిస్తున్నట్లు కిమ్స్ డాక్టర్స్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ మేరకు బుధవారం సుర్జాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత శిబిరా గోడప్రతులు కరపత్రాలను సర్పంచ్ వెంకట రాములు తోపాటు కేమ్స్ డాక్టర్స్ తదితరుల ఆధ్వర్యంలో విడుదల చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పి మధుకర్ స్వామి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిమ్స్ డాక్టర్లు మధు దేవరశెట్టి తోట నరేంద్ర కుమార్ సిహెచ్ అశ్విన్ కుమార్ ఉన్నట్లు ఈ ప్రాంత మెడికల్ ఆర్గనైజర్ ఎనుగందుల సాయి కృష్ణ అన్నారు ఉచితంగా నిర్వహించే ఈ శిబిరాన్ని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాయి కృష్ణ కోరారు ఉచిత పరీక్షలు సుర్జాపూర్ హైస్కూల్ ప్రాంగణంలో ఈనెల 28 ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించబడుతుందని పరీక్షలు చేయించుకునే వ్యక్తులు మధ్యాహ్నం రెండు గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు

# పారదర్శక ఓటర్ల జాబితా తయారీనే ఎస్ఐఆర్ లక్ష్యం

## బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్






**మంచిర్యాల, 24,జూన్ (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారు చేయడమే ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కిష్టంపేటలోని బీఎంఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి బీఎల్ఏ--2 వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎస్ఐఆర్‌పై అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఏ ఒక్కరి ఓటు కోల్పోయే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో ఉన్న లోపాల కారణంగా కొందరు రెండు లేదా మూడు చోట్ల తమ పేర్లను నమోదు చేసుకున్నారని, అలాగే దశాబ్దాలుగా మరణించిన వ్యక్తుల పేర్లు కూడా తొలగించకుండా కొనసాగుతున్నాయని తెలిపారు. అలాంటి లోపాలను సరిచేసి పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని అన్నారు. బీఎల్ఏ--2లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా కృషి చేయాలని సూచించారు. 2002 ఓటర్ల జాబితాలో తల్లిదండ్రుల పేర్లు లేని వారు కూడా 13 రకాల ఆధారాలతో తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందని, ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని అన్నారు. అనంతరం ఎన్‌రోల్‌మెంట్ ఫారాలు ఎలా నింపాలి, 2002 ఓటర్ల జాబితాలో పేర్లను ఎలా పరిశీలించాలి తదితర అంశాలపై బీఎల్ఏ--2లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్, ఎస్ఐఆర్ రాష్ట్ర కోఆర్డినేటర్ హరిబాబు, బీఎల్ఏ--1 జాడి తిరుపతి, చెన్నూరు మండల అధ్యక్షులు బుర్ర రాజశేఖర్, జిల్లా కార్యదర్శి రత్న లక్ష్మీనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు డీవీ దీక్షితులు, దేవరనేని సంజీవరావు, మల్యాల రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతోనే మెరుగైన భవిష్యత్తు

## రఘునాథ్ వెరబెల్లి,బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు






మంచిర్యాల, 24, జూన్ ( ప్రజా జ్యోతి ):విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా జీవితంలో మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం హాజీపూర్ మండలంలోని దొనబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సబ్బేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లలో బ్యాగులు, నోట్ బుక్స్, జ్యామెట్రీ బాక్సులు అందజేశారు.ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం తమ వంతు సహాయంగా స్కూల్ కిట్లు అందిస్తున్నా మని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి, విద్యాపట్ల ఆసక్తి పెంపొందించేందుకు తమ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా చదువులో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. కష్టపడి చదివితేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవ చ్చని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దొనబండ సర్పంచ్ బేతు రమాదేవి, రవి, గడ్డం స్వామి రెడ్డి, మాధవరపు రమణరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు.

## పెద్దనపల్లి గ్రామ సర్పంచ్‌కు సన్మానం



మంచిర్యాల, 24, జూన్ (ప్రజాజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని పెద్దనపల్లి గ్రామ సర్పంచ్ కల్వల శరత్ కుమార్‌ను బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచిగా నూతనంగా ఎన్నికైన శరత్ కుమార్‌కు అకాడమీ సభ్యులు శాలువా కప్పి మర్యాదపూర్వకంగా సన్మానం చేశారు. క్రీడాభిమాని అయిన శరత్ కుమార్ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తారని అకాడమీ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ, మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ప్రాంత యువ క్రీడాకారులకు మంచి శిక్షణ అందిస్తున్నారని కొనియాడారు. అకాడమీ అందిస్తున్న శిక్షణను వినియోగించుకుని క్రికెట్ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. అకాడమీకి తన సహాయ సహకా రాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో అకాడమీ వ్యవస్థాపకులు అల్లం వెంకటేశ్వర్లు, సభ్యులు గౌతం కుమార్, జాడి శేఖర్, జనగామ రాజు తదితరులు పాల్గొన్నారు.

# తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కార సాధనలో సింగరేణిలో కొనసాగుతున్న సింగరేణి అధికారుల నిరసనలు

**శ్రీరాంపూర్ ఏరియాలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహణ**



మంచిర్యాల, 24, జూన్ (ప్రజాజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కార సాధనలో భాగంగా సింగరేణి అధికారుల నిరసన కార్యక్రమాలు సింగరేణిలో కొనసాగుతున్నాయి. ఈ నెల 19న శ్రీరాంపూర్ ఏరియాలో ర్యాలీతో పాటు అన్ని రీజియన్లలో ర్యాలీలు నిర్వహించి యాజమాన్యం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అయినా యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం మంచిర్యా జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో మరోసారి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉదయం నుంచే నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించిన అధికారులు సాయంత్రం జీఎం కార్యాలయం పరిధిలో నిరసన తెలిపారు. సీఎంఓఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు లక్కాకుల మహేష్ నాయకత్వంలో శ్రీరాంపూర్ ఏరియా అధికారులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ వేదిక ప్రాంగణంలో తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నుంచి నిరాహార దీక్షలకు సైతం వెళ్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు లక్కాకుల మహేష్, జనరల్ సెక్రటరీ మల్లయ్య, జాయింట్ సెక్రటరీ భీమన్న, ట్రెజరర్ పద్మలతో పాటు శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, కార్యాలయాల అధికారులు, మహిళా అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అధికారులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం వెంటనే స్పందించాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## సర్కారు ఆశ్రమ బడుల్లో సౌకర్యాల కొరత

**టీడబ్ల్యూడీవో రమాదేవికి కేవీపీఎస్ వినతి**

**శిథిల భవనాలు.. కరెంట్, నీళ్లు లేక విద్యార్థుల అవస్థలు**



ఆసిఫాబాద్ జూన్ 24 ప్రజా జ్యోతి గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలు గుట్టలుగా పేరుకుపోయాయి. కనీస సౌకర్యాలు లేక గిరిజన విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు.నూతన విద్యా సంవత్సరం 2026–27 మొదలైనా జిల్లాలోని ఆశ్రమ బడుల్లో సమస్యలు తీరలేదని మండిపడ్డారు. వర్షాకాలం మొదలైంది.. విషజ్వరాలు విరుచుకుపడే ప్రమాదం ఉంది. వెంటనే అన్ని స్కూళ్లు, హాస్టళ్లలో వైద్య శిబిరాలు పెట్టాలని డిమాండ్ చేశారు. కొన్ని బడుల భవనాలు పూర్తిగా శిథిలమైపోయాయని, వానొస్తే పిల్లల ప్రాణాలకే ముప్పు అని హెచ్చరించారు. వెంటనే మరమ్మత్తులు చేయించి సేఫ్‌గా ఉండేలా చూడాలన్నారు. తాగడానికి గుక్కెడు నీళ్లు లేవు.. రాత్రిపూట కరెంట్ ఉండదు.. పిల్లలు చీకట్లో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటలు నీళ్లు, కరెంట్ ఇవ్వాలని కోరారు. కట్టబడిగా ఉన్న గిరిజన ప్రైమరీ స్కూల్ భవనాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి పిల్లలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. గిరిజన బిడ్డల సంక్షేమం కోసం అధికారులు వెంటనే కదలాలని దినకర్ విజ్ఞప్తి చేశారు

## వాంకిడి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా వై. అనిల్ బాధ్యతలు




ఆసిఫాబాద్ జూన్ 24 ప్రజా జ్యోతి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వాంకిడి శాఖ నూతన మేనేజర్‌గా వై. అనిల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జె. కృష్ణ నీల్‌వై బదిలీ కావడంతో, మంచిర్యాల శాఖ నుంచి బదిలీపై వచ్చిన అనిల్‌కు బ్యాంక్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు, స్వయం సహాయక సంఘాలు, యువతకు బ్యాంకు ద్వారా లభించే రుణాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొని నూతన మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఐక్య పోరాటమా ? ఒంటరి పోరుబాటా ?

సింగరేణి కార్మికుల్లో ఆశలు రేకెత్తిస్తున్న జేబీసీసీఐ--12, ఉద్యమాలు చాలా ఏళ్ల తర్వాత జాతీయ సంఘాలు ఒకటే అవుతున్నాయి.
12వ వేతన ఒప్పందం అమలతోపాటు, సింగరేణి సంస్థలు నెలకొన్న అపరిత సమస్యలపై, సింగరేణి పరిరక్షణ కోసం సమరానికి సై అంటున్నాయి.
జూలై 1 లోగా అమీ -- తుమీ తేల్చుకోవాలని సిద్ధమవుతున్నాయి.
మరో జాతీయ కార్మిక సంఘమైన బి ఎం ఎస్ మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది
ఈ తాజా పరిణామాలతో సింగరేణిలో అసలు ఏం జరుగుతోందో అర్థం కాక కార్మికులు పరేషాన్ అవుతున్నారు
ఈ నేపథ్యంలో పోరాట బాటపై " ప్రజా జ్యోతి" లో ప్రత్యేక కథనం...

**మంచిర్యాల, 24, జూన్ (ప్రజాజ్యోతి):** సింగరేణి బొగ్గు గనుల్లో మరోసారి ఉద్యమాల వేడి మొదలైంది. కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత, హక్కులు, సంక్షేమం వంటి కీలక అంశాలపై జాతీయ కార్మిక సంఘాలు పోరాట బాట పట్టడంతో బొగ్గు బాయిల్లో విస్తృత చర్చ సాగుతోంది. ముఖ్యంగా కార్మికుల వేతన సవరణకు కీలకమైన జేబీసీసీఐ--12 (జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ కోల్ ఇండస్ట్రీ) ఏర్పాటు, త్వరితగతిన వేతన ఒప్పందం పూర్తి చేయాలనే డిమాండ్ ఇప్పుడు ప్రధాన అంశంగా మారింది. ఈసారి పరిస్థితి గతంతో పోలిస్తే భిన్నంగా కనిపిస్తోంది. సాధారణంగా తమ తమ విధానాలతో ముందుకు వెళ్లే కార్మిక సంఘాలు ఇప్పుడు రెండు వేర్వేరు మార్గాల్లో కనిపిస్తున్నాయి. నాలుగు జాతీయ కార్మిక సంఘాలు ఒకే వేదికపైకి వస్తుండగా, బీఎంఎస్ మాత్రం ప్రత్యేక పోరాట కార్యాచరణ ప్రకటించడం ఆసక్తికరంగా మారింది.




**నాలుగు జాతీయ సంఘాలు -- ఒకే వేదిక...............**

కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ, సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ, సీపీఎం అనుబంధ సీఐటీయూ, అలాగే హెచ్‌ఎంఎస్ కలిసి సంయుక్త పోరాట కార్యాచరణ ప్రకటించాయి. జేబీసీసీఐ--12 చర్చలు వేగవంతం చేయడం, కార్మిక వ్యతిరేకంగా భావిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, కార్మిక ప్రయోజనాలను కాపాడడం వంటి అంశాలపై పోరాటం చేయాలని నిర్ణయించాయి. జూన్ 29 నుంచి వివిధ ఏరియాల్లో గేట్ మీటింగ్‌లు, ప్రెస్ మీట్‌లు నిర్వహించనుండగా, జూలై 1న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద భారీ ధర్నా కార్యక్రమానికి సిద్ధమవుతున్నాయి.

**హెచ్‌ఎంఎస్ చురుకుదనం -- సింగరేణిపై ప్రత్యేక దృష్టి...........**

సింగరేణి కార్మిక సమస్యలపై హెచ్‌ఎంఎస్ తరపున గత కొంతకాలంగా ప్రత్యేక ఉద్యమాలు కొనసాగుతున్నాయని కార్మిక వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే కల్వకుంట్ల కవిత సింగరేణి ప్రాంతాల్లో పర్యటిస్తూ కార్మిక సమస్యలు, సంస్థ పరిరక్షణ, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేస్తు వస్తున్నారని కార్మిక వర్గాలు చర్చించుకుంటున్నాయి. సింగరేణి భవిష్యత్తు, కార్మికుల ప్రయోజనాల అంశాన్ని రాజకీయంగానూ ముందుకు తీసుకెళ్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ఒంటరి కార్యాచరణలో బీఎంఎస్..................**

మరోవైపు భారతీయ జనతా పార్టీ అనుబంధ కార్మిక సంఘం బీఎంఎస్ మాత్రం సంయుక్త పోరాటానికి దూరంగా ఉంటూ ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది.జూన్ 25 నుంచి 30 వరకు ప్రతి బొగ్గు గని, ఏరియా కార్యాలయం, ఇతర కార్యాలయాల్లో గేట్ మీటింగ్‌లు నిర్వహించి కార్మికులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. అంతేకాకుండా జేబీసీసీఐ--12 కమిటీని వెంటనే ఏర్పాటు చేయడం, వేతన ఒప్పందం త్వరగా పూర్తి చేయడం, కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడం వంటి అంశాలపై ఇప్పటికే కోల్ ఇండియా స్థాయి సమావేశాల్లో తమ డిమాండ్లను వినిపించినట్లు ప్రకటించింది.

**కార్మికుల్లో పెరుగుతున్న ఆశలు.......**

సింగరేణిలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు జేబీసీసీఐ--12 అత్యంత కీలకంగా మారింది. కొత్త వేతన సవరణ వల్ల వేతనాల పెంపు, అలవెన్సులు, ఇతర ప్రయోజనాలు వచ్చే అవకాశం ఉండటంతో కార్మికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గతంలో వేతన ఒప్పందాల విషయంలో ఆలస్యం జరిగిన అనుభవాల కారణంగా కొంత సందేహం ఉన్నప్పటికీ, ఒకేసారి జాతీయ కార్మిక సంఘాలు ఉద్యమ బాట పట్టడం ఆశావహ వాతావరణాన్ని సృష్టిస్తోంది.

**సఫలమవుతాయా పోరాటాలు..?..............**

ఇప్పుడు సింగరేణి బొగ్గు బాయిల్లో ఒకటే చర్చ నడుస్తోంది. వేర్వేరు రాజకీయ నేపథ్యాలతో ఉన్న సంఘాలు చేపడుతున్న ఈ పోరాటాలు నిజంగా కార్మికుల అపరిష్కృత సమస్యలకు పరిష్కారం చూపగలవా? జేబీసీసీఐ--12 కమిటీ త్వరగా ఏర్పడి వేతన ఒప్పందం అమలులోకి వస్తుందా? కార్మికులకు న్యాయం జరుగుతుందా? అన్న ప్రశ్నలు కార్మిక వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా సింగరేణి కార్మికుల భవిష్యత్తు, హక్కులు, వేతనాల అంశంపై ప్రారంభమైన ఈ ఉద్యమాలు రాబోయే రోజుల్లో కీలక మలుపులు తిరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సింగరేణి స్విమ్మింగ్ పూల్ చార్జీల సవరణ

**జూలై 1 నుంచి కొత్త రేట్లు అమలు**

**మంచిర్యాల, 24, జూన్ (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ పరిధిలోని స్విమ్మింగ్ పూల్స్ వినియోగ చార్జీలను సవరించినట్లు సంస్థ యాజమాన్యం ప్రకటించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు, అలాగే సాధారణ పౌరులు వినియోగించుకునే స్విమ్మింగ్ పూల్ ఫీజుల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సవరించిన చార్జీలు 1,జూలై 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. సింగరేణి ఉద్యోగులకు నెలవారీ చార్జీ రూ.200గా నిర్ణయించగా, ఉద్యోగులపై ఆధారపడిన 15 సంవత్సరాలు పైబడిన కుటుంబ సభ్యులకు రూ.150, 14 సంవత్సరాల లోపు పిల్లలకు రూ.100గా నిర్ణయించారు. రిటైర్డ్ ఉద్యోగులకు నెలకు రూ.300గా చార్జీ విధించనున్నారు. అలాగే సింగరేణి ఉద్యోగులు కాని పౌరులకు 15 సంవత్సరాల పైబడిన వారికి రూ.1,200, 14 సంవత్సరాల లోపు పిల్లలకు రూ.1,000 చార్జీలు నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జనరల్ మేనేజర్ (పర్సనల్) ఉత్తర్వుల్లో తెలిపారు .

## అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

**కరీంనగర్ ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్**

**మంచిర్యాల, 24, జూన్ (ప్రజాజ్యోతి):** 2026-27 విద్యా సంవత్సరానికి గాను కరీంనగర్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 1వ తరగతి నుండి పదవ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో, అలాగే 10వ తరగతి తెలుగు మీడియంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 6 నుండి 14 సంవత్సరాల మధ్య ఉండాలని, అంధ బాలబాలికలు ఉత్తర తెలంగాణ రాష్ట్ర నివాసులై ఉండాలని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, పాదరక్షలు, వసతి గృహ సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సదరం ఉ యు.డి.ఐ.డి దివ్యాంగ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, బదిలీ సర్టిఫికేట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కరీంనగర్‌లోని విజయపురి కాలనీ, మల్కాపూర్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 9701190127, 9440338424 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఎస్‌సి న్యాయ శాస్త్ర పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలి

**జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్**



**మంచిర్యాల, 24, జూన్ (ప్రజాజ్యోతి):** జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయ శాస్త్ర పట్టభద్రులు శిక్షణ భృతి, న్యాయ శాస్త్ర గ్రంథాలు, ఫర్నిచర్ సదుపాయాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఈ పథకం అమలు చేయబడుతుందని తెలిపారు. 39 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన న్యాయ శాస్త్ర పట్టభద్రులను మూడు సంవత్సరాల పాటు న్యాయ పరిపాలనలో శిక్షణ నిమిత్తం జిల్లాలోని న్యాయ అధికారులకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు నెలకు రూ.3 వేల చొప్పున శిక్షణ భృతి అందించడంతో పాటు, న్యాయ శాస్త్ర గ్రంథాలు మరియు ఫర్నిచర్ కొనుగోలు కోసం ఒకేసారి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.అర్హత గల న్యాయ శాస్త్ర పట్టభద్రులు జూలై 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు బార్ అసోసియేషన్ సభ్యులై ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. అభ్యర్థులు మీ-సేవ ద్వారా జారీ చేయబడిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు తదితర పత్రాలను నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత దరఖాస్తులు, పత్రాలను సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల శాఖ కార్యాలయంలో సమర్పించాలని, ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

## బంబారలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**కాంగ్రెస్ నేతల సమక్షంలో వేడుక**



**ఆసిఫాబాద్, జూన్ 24 ప్రజా జ్యోతి** కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం బంబార గ్రామంలో బోయిరే సుజాత-లక్ష్మణ్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గురుసులే నారాయణ యువజన అధ్యక్షులు ఉప్పుల కృష్ణ, హాజరై దంపతులను అభినందించారు. గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ, ఉప సర్పంచ్ జాడే సంతోష్, సెండే అన్నాజీ, జాడే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. గృహ యజమానులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## బొడ జనార్ధన్ జన్మదిన వేడుకలు

**టీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా సంబరాలు**



**ఆసిఫాబాద్ జూన్ 24 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బొడ జనార్ధన్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు, టీఆర్ఎస్ నాయకులు డాక్టర్ అశోక్ మహుల్కర్, ఆర్పీఐ జిల్లా అధ్యక్షులు దుర్గం శ్యామ్ రావు, టీఆర్ఎస్ నేతలు ఆత్రం వినోద్, నైతం తిరుపతి, అరుణ్ మహుల్కర్, నాగసేన్ ఉప్రే, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ మృతుని కుటుంబానికి అండగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి.

**మృతదేహాన్ని స్వదేశానికి పంపేలా చర్యలు.**

**సంబంధిత అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి**



**సారంగాపూర్, జూన్ 24, ప్రజా జ్యోతి** వైకుంఠాపూర్ గ్రామానికి చెందిన లగ్గాం జగదీష్ ఉపాధి నిమిత్తం దుబాయ్ కి వెళ్ళాడు, జూన్ 21 న దుబాయ్ లో ప్రమాదవశాత్తు జరిగిన ఆక్సిడెంట్ లో జగదీష్ మృతి చెందడం తో కుటుంబ సభ్యులు, మండల బీజేపీ నాయకులు సమాచారాన్ని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో హుటాహుటిన స్పందించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంబంధిత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారుల తో, ఎన్నారై సెల్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా మృత దేహాన్ని స్వదేశానికి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పలు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలకై సాధారణ సమావేశంలో తీర్మానం

### మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక

**ఖానాపూర్ జూన్ 24( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పురపాలక సంఘం పరిధిలోని 12 వార్డులలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి తీర్మానించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక తెలిపారు ఈ సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు జూన్ మాసపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ సమావేశ కార్యక్రమం ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఉన్నటువంటి కోతులను పట్టించి నిర్మల్ లోని అడవి శాఖ పునరావాస కేంద్రానికి పంపుట గురించి, వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని దోమలు ఏర్పడకుండా కాలనీలలో ఫాగింగ్ స్ప్రే బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయించుట, ప్రధాన రహదారి ఎన్టీఆర్ చౌరస్తా నుండి అంగడి బజార్ వరకు రోడ్డు మీద ఉన్నటువంటి గుంతలను తాత్కాలిక మరమ్మతులు చేయించి ప్రజలకు వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చేస్తామని తీర్మానించారు వార్డులలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుట కూలిపోయిన పాత మురికి కాలువల మరమ్మతులు, గోదావరి నది తీరం వద్ద మహిళలు వృద్ధులు ప్రజల కోసం శాశ్వత వాటర్ షవర్లు ప్లాట్ ఫామ్ లను నిర్మించుట గురించి నూతన విద్యుత్ దీపాల ఏర్పాటు అన్ని వార్డులలో లేనటువంటి



విద్యుత్ స్తంభాల స్థలంలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అలాగే ఖానాపూర్ పట్టణ అభివృద్ధి పనులకు సంబంధించిన పలు అంశాల పైన జూన్ మాసపు మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశ కార్యక్రమంలో చర్చించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్ కౌన్సిలర్స్ తిరుమల గంగాధర్ ,తాళ్లపల్లి రాజగంగన్న సాజియా బేగం జమాల్ గుమ్ముల ఆనంద్ కుమార్ మేష పోసాని నిమ్మల రామేష్ బొప్పరపు సత్యవతి బండి పెల్లి సింధుజ ప్రకాష్ గౌడ్ చిన్నం సత్యనారాయణ ,తొడసం ఇందిరా మున్సిపల్ మేనేజర్ సురేందర్ మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఓటర్ల మ్యాపింగ్‌లో నిర్లక్ష్యంపై అధికారుల వైఖరిపై తాసిల్దార్ కు మైనార్టీల ఫిర్యాదు

**ఖానాపూర్, జూన్ 24: (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణ పరిధిలో సుమారు 500 మంది ఓటర్ల మ్యాపింగ్ పని ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు, మతపెద్దలు ఆరోపించారు ఈ మేరకు స్థానికతహసీల్దార్ సుజాత రెడ్డికి బుధవారం వినతిపత్రం సమర్పించారు పోలింగ్ స్టేషన్ నెం. 242కు చెందిన ఎస్. రాజు పి.ఎస్. నెం. 236కు చెందిన రామలక్ష్మి ఓటర్ల మ్యాపింగ్ పనిని పూర్తిగానిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఫోన్ ద్వారా సంప్రదించినప్పుడు “మాకు సంబంధం లేదు, మేము ఆ పని చేయము” అంటూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.అంతేకాకుండా, ఈ విషయమై ప్రతినిధులు సంబంధిత సూపర్వైజర్ కిషన్‌ను సంప్రదించి పెండింగ్ మ్యాపింగ్ పనిపై వివరణ కోరగా, “నాకు దీనితో ఎలాంటి సంబంధం లేదు, ఈ విషయమై నన్ను ఎవరూ సంప్రదించవద్దు” అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారులు ఈ విధంగా స్పందించడం విచారకరమని వినతి పత్రంలో పేర్కొన్నారు.ఇప్పటి వరకు ఎంత శాతం మ్యాపింగ్ పూర్తయిందనే వివరాలను కూడా అధికారులు వెల్లడించడం లేదని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు




తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే ఓటర్ల మ్యాపింగ్ పనిలో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బంది సంబంధిత అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సుమారు 500 మంది ఓటర్ల మ్యాపింగ్ పనిని పూర్తి చేయడానికి వెంటనే ప్రత్యేక ఉద్యోగిని నియమించాలని తహసీల్దార్‌ను కోరారు. ఇందులో జమా మస్జిద్ అధ్యక్షులు జహీర్ అహ్మద్, దారుల్ ఉలూమ్ పెద్దలు షాహిద్ మౌలానా, కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాయవాది ఎస్.కె. షబ్బీర్ పాషా, కో-ఆర్డినేటర్ అఫ్రోజ్, మొహమ్మదియా మస్జిద్ మౌలానా అతీక్ ఉద్దీన్ సూఫీ, అలం ఖాన్, జియా ఉల్ హాక్, మొహసీన్, వాసే ఖాన్ వివిధ మస్జిద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక సమావేశం

తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్ ) ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక ( సి జి ఆర్ ఎఫ్ -) సమావేశం ఈ నెల 25న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు కడం విద్యుత్ కార్యాలయంలో నిర్వహించ పడుతుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ సమావేశంలో కడం, ఖానాపూర్, దస్తురాబాద్, పెంబి మామడ అనుబంధ సెక్షన్ల పరిధిలోని 5 మండలాల విద్యుత్ వినియోగదారులు పాల్గొని, విద్యుత్ సమస్యలు, తదితర అంశాలకు సంబంధించిన తమ ఫిర్యాదులు, వినతులు సూచనలను నేరుగా కమిటీ సభ్యుల దృష్టికి తీసుకురావచ్చని వివరించారు సంబంధిత5 మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యల పరిష్కారం కొరకు సమావేశానికి హాజరుకావలసిందిగా కోరారు టి.శ్రీనివాస్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్ సబ్ డివిజన్, ఖానాపూర్ అధికారి కోరారు

## బదిలీపై వచ్చిన అధికారులకు బి ఆర్ ఎస్ నాయకుల ఘన సన్మానం



**సోనాల, జూన్ 24 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండలానికి కొత్తగా బదిలీపై వచ్చిన ఎంపీడీవో రత్నాకర్ రావు, నాయబ్ తాసిల్దార్ ప్రేమ్ నివాస్, మరియు ఆర్ఐ సునీత లను, బి ఆర్ ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ మర్యాద పూర్వక సమావే శంలో, నూతన అధికారులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో కొత్త అధికారులు ముందుంటారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సమస్యలపై అధికారులకు పూర్తి అవగాహన కల్పిస్తామని, ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు ఇర్ల అభిలాష్, యాళ్ల సుధీర్ రెడ్డి, తుల శ్రీకాంత్, బత్తుల రమేష్, తుల హరీష్ పాల్గొన్నారు.

## నేడు (25న) సరుకుల సరఫరా టెండర్ల ఖరారు

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)** నేడే (జూన్ 25, 2026) గు రు వారం నాడు ఐటిడిఏ ఉట్నూ రు పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సంక్షేమ వసతి గృహాలు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లు, గురు కు లాలకు అవసరమయ్యే ని త్యావసర/ఆహార వస్తువులు, క్లీనింగ్ వస్తువులు, పెరిషబు ల్స్ సరఫరా కొరకు టెండర్ లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు ఆధ్వర్యం లో అధికారుల బృందం ఖరా రు చేయనున్నట్లు గిరిజన స హకార సంస్థ (జీసీసీ) డివిజ నల్ మేనేజర్ గుడిమళ్ల సందీ ప్ కుమార్ ఒక ప్రకటనలో తె లిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదే శాల మేరకు జూలై, ఆగస్టు నెలలకు గాను ఆహార వస్తు వులు సరఫరా చేయటానికి ఈ నెల 10 నుం డి 22 వరకు ఆన్లైన్ టెండర్ తెలంగాణ ఈ పోర్టల్ ద్వారా టెండర్ లు ఆ హ్వానించినట్లు తెలిపారు. ఆ న్లైన్ లో టెండర్ వేసిన వ్యా పారస్తులు, వ్యక్తులు జూన్ 25 తేదీ గురువారం నాడు ఉ దయం 10.30 గంటలకు టెం డర్ ల ఖరారు కొరకు ఐటీడీఏ ఉట్నూర్ లో జరిగే కార్యక్ర మంలో పాల్గొనాలని ఈ సం దర్భంగా కోరారు.

## మెటీరియల్ పంపిణీ చేసిన తహసిల్దార్ సరిత

**లక్ష్మణ చాంద, జూన్ 24(ప్రజా జ్యోతి)**లక్ష్మణ చాంద స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ మెటీరియల్ ను తహసిల్దార్ సరిత బుధవారం బిఎల్ఓ(పోలింగ్ కేంద్ర స్థాయి అధికార్లకు పంపిణీ చేశారు.నేటి నుండి ఓటరు జాబితాకు సంబందించిన స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ సర్వే నిర్వహిస్తున్నందున ఈ మెటీరియల్ ను వారికి అందజేసినట్లు ఆమె తెలిపారు.ఈ మెటీరియల్ లో గణన ఫారం కోసం సమాచార పత్రం,పెన్నులు,పెన్సిల్ లు,మార్కర్ లు,ఒక రఫ్ నోట్,ఒక ఫైల్,ఒక చెత్తిరి తదితరాలు ఉన్నాయి. సర్వే సమయంలో బిఎల్ ఓల సౌకర్యార్థం వీటన్నిటిని తెలంగాణ ప్రభుత్వం సమకూర్చినట్లు ఆమె వివరించారు. కాగ ఈ సర్వే ఈ నెల 25 ప్రారంభమై జులై 24 వరకు అంటే నెల రోజులపాటు కొనసాగనుంది.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సరిత తో పాటు డిప్యూటీ తహసీల్దారు బాబుసింగ్,రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## వేధింపుల రహిత సమాజమే లక్ష్యం

..టి సేఫ్ యాప్ పై అవగాహన

...మంచిర్యాల జిల్లా షి టీమ్ ఎస్.ఐ. ఉషారాణి



మందమర్రి టౌన్ జూన్ 24 ప్రజా జ్యోతి రామగుండం పోలీస్ కమిషనర్. అంబర్ కిషోర్ ఝా.ఐ.పి.యస్.(డి.ఐ.జి) ఆదేశాల మేరకు మంచిర్యాల డిసిపి భాస్కర్. ఐ.పి. యస్. పర్యవేక్షణ లో మంచిర్యాల జిల్లా షి టీమ్ ఎస్.ఐ.ఉషారాణి ఆధ్వర్యంలో తెలంగాణ లోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సర్ప్) మందమర్రి మండల సమాఖ్య ఉద్యోగులకి మహిళా శక్తి భవనంలో బుధవారం మహిళల భద్రతకు సంబంధించి షి టీమ్ సిబ్బంది షి టీమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ సిబ్బంది మాట్లాడుతూ, మహిళలకు అమలు చేస్తున్న భద్రత సంబందిత చర్యలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, టి సేఫ్ యాప్ షీ టీమ్ లపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా వేధింపులకు గురి చేసినట్లయితే ఎప్పుడూ అందుబాటులో ఉండే రామగుండం షీ టీమ్ నంబర్ 6303923700, మంచిర్యాల షి టీమ్ నంబర్ 8712659385 లేదా డయల్ 100 నంబర్ కి ఫోన్ చేయాలి అని అలాగే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 అని తెలిపారు,ఈ నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.అలాగే సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలోమంచిర్యాల జిల్లా షి టీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు సతీష్ , జ్యోతి, మందమర్రి ఏపిఎమ్ చంద్రశేఖర్ ,అన్ని గ్రామ సంఘాల సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాంగ్ సమాజ్ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేత



**ఆసిఫాబాద్, జూన్ 24 ప్రజా జ్యోతి** ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న మాంగ్ సమాజ్ ప్రజల సమస్యలను పరిష్కరించి, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మొహాలే దత్తా మాంగ్ కోరారు. బుధవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా భోజ్జు పటేల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలోని మాంగ్ సమాజ్ ప్రజలకు భూమి పట్టాలు మంజూరు చేయాలని, పహాణీలు, నకళ్లు అందించాలని, అర్హులైన రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. విద్యార్థులకు గురుకులాలు, పాఠశాలల్లో సీట్లు కేటాయించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ఎమ్మెల్యేలను కోరారు.

## ఖాజీగా హత్య నిందితుడు వద్దు

డా.సాహెర భానుకు తల్లి ఫిర్యాదు



**ఆసిఫాబాద్, జూన్ 24 ప్రజా జ్యోతి** తన కుమార్తె హత్య కేసులో నిందితుడిగా ఉన్న మీర్ తాహెర్ అలీ హష్మీని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఖాజీగా నియమించవద్దని నసీమా సుల్తానా కోరారు. జూన్ 24న జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు డా.సాహెర భానును కలిసి ఫిర్యాదు చేశారు. 2026 మే 19న జారీ చేసిన జీఓఆర్టీ నెం.69ను రద్దు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తన కుమార్తె రేష్మా బేగం మృతికి తాహెర్ అలీ కారకుడని, అదనపు కట్నం కోసం వేధించి ఆత్మ హత్యకు ప్రేరేపించాడని ఆరోపించారు. సంతోష్‌నగర్ పీఎస్‌లో ఎఫ్ఐఆర్ నెం.262/2023, ఐపీసీ 498(ఏ), 306, 34 సెక్షన్ల కింద కేసు నమోదై నాంపల్లి కోర్టులో విచారణలో ఉందని తెలిపారు. షరియా ప్రకారం ఖాజీ మేజిస్ట్రేట్‌తో సమానమని, నిందితుడికి ఆ పదవి ఇవ్వడం ముస్లిం సమాజానికి అవమానమని పేర్కొన్నారు.

## సీపీఐ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయ శిక్షణ శిబిరాలను విజయవంతం చేయాలి సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**తాండూర్, జూన్,24 (ప్రజాజ్యోతి):** తాండూర్ మండలంలోని ఐబి భగత్‌సింగ్ కార్యాలయంలో బుధవారం సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం కొండు బానేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. దేశం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, ఆర్థిక సంక్షోభాలు, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జూన్ 28 నుంచి 30 వరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మూడు రోజుల రాజకీయ శిక్షణ తరగతులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవెన శంకర్ పాల్గొని వివిధ అంశాలపై బోధిస్తారని తెలిపారు.ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, మండల కార్యదర్శి కొండు బానేష్, జిల్లా సమితి సభ్యులు సాలిగామ సంతోష్, బయ్యా మొగిలి, మాజీ ఎంపీపీ కామెర మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి నరాల ప్రహ్లాద్, కోశాధికారి పట్టి శంకర్, వార్డు సభ్యుడు కుర్సింగ తిరుపతి, నాయకులు కామెర దుర్గయ్య, కొండు సాయి తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె నోటీసుపై నేడు ఆర్ఎల్‌సీతో చర్చలు

## నేటి సమావేశంపై సింగరేణి కార్మికుల్లో చిగురుస్తున్న ఆశలు

## హైదరాబాద్‌లో సింగరేణి అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధులతో ఆర్ఎల్‌సీ సమావేశం

**మంచిర్యాల, 24, జూన్ (ప్రజా జ్యోతి):** సింగరేణి కార్మికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలక పరిణామానికి నేడు తెరలేవనుంది. గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఇచ్చిన సమ్మె నోటీసుపై రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో నేడు హైదరాబాద్‌లో కీలక చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశానికి సింగరేణి అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధులు హాజరుకానుండటంతో కార్మికుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఈ సమావేశం ద్వారా పరిష్కారం లభిస్తుందా అనే ఉత్కంఠ నెలకొంది. ఇటీవల సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసింది. కార్మికులకు సంబంధించిన 31 ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన సమ్మె నోటీసు ఇవ్వడంతో ఆ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై స్పందించిన రీజనల్ లేబర్ కమిషనర్ నేడు హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో చర్చలు నిర్వహించనున్నారు. సమస్యలపై చర్చించేందుకు రావాలని గుర్తింపు కార్మిక సంఘానికి సమాచారం కూడా అందించింది . దీంతో నేడు ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగే సమావేశం ద్వారా తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశాభావం కార్మికుల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గుర్తింపు కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్న అంశాల్లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డును కొనసాగించడం, ఇన్‌కమ్ ట్యాక్స్ భారాన్ని తగ్గించడం, కార్మికులకు సొంత ఇంటి కలను నెరవేర్చడం వంటి ప్రధాన అంశాలతో పాటు మొత్తం 31 డిమాండ్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇరు వర్గాలను చర్చలకు పిలవడంతో కార్మికులతో పాటు ఇతర వర్గాల్లో కూడా ఆసక్తి నెలకొంది. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ 2023లో జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందాయి. ఎన్నికల సందర్భంగా ఈ రెండు సంఘాలతో పాటు ఇతర కార్మిక సంఘాలు కూడా కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధించి పలు హామీలు ఇచ్చాయి. ప్రస్తుతం సింగరేణిలో దాదాపు 39 వేల మంది కార్మికులకు పైగా 11 ఏరియాల్లోని అండర్‌గ్రౌండ్ గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేస్తున్నారు. కార్మికులకు అత్యంత కీలకమైన మెడికల్ బోర్డు గత సంవత్సరం కాలంగా పెండింగ్‌లో ఉంది. దీనివల్ల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు వచ్చే ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో కార్మికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.




దాదాపు రెండు నుంచి రెండున్నర వేల మంది కార్మికులు మెడికల్ బోర్డు కోసం దరఖాస్తులు చేసుకుని ఎదురుచూస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతో పాటు ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం, హెచ్ఎంఎస్, సీఐటీయూ, బీఎంఎస్ వంటి ప్రధాన కార్మిక సంఘాలు కూడా ఉద్యమాలు, ఆందోళనలు చేపడుతున్నాయి. అయినప్పటికీ సింగరేణి యాజమాన్యం నుంచి స్పష్టమైన స్పందన రాకపోవడంతో కార్మికుల్లో అసహనం పెరుగుతోంది. ఇక మెడికల్ బోర్డును పూర్తిగా ఎత్తివేస్తారనే ప్రచారం జరగడంతో మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికులు మరింత ఆందోళనకు గురయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా భూపాలపల్లిలో జరిగిన ఒక సభలో మెడికల్ బోర్డు కొనసాగుతుందని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు కనిపించకపోవడం కార్మికుల్లో నిరాశ కలిగిస్తోంది. ఈ మెడికల్ బోర్డు అంశంతో పాటు ఇతర కార్మికుల అపరిష్కృత సమస్యలను ప్రధానంగా తీసుకుని గుర్తింపు కార్మిక సంఘం సమ్మె నోటీసు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్మిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు సింగరేణిలో ఉన్న ఇతర కార్మిక సంఘాలు కూడా ఈ అంశంపై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీపై ప్రశ్నలు సంధించాయి. దీంతో కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా ఏఐటీయూసీ నాయకత్వం సమ్మె నోటీసు ఇవ్వక తప్పలేదని చర్చ జరుగుతోంది. మరి నేడు జరిగే చర్చల్లో సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తే కీలక సమస్యలకు పరిష్కారం దొరికే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ సమావేశం ఫలవంతం కావాలని ఇతర కార్మిక సంఘాలు కూడా ఆశిస్తున్నాయి. సింగరేణి కార్మికుల అపరిష్కృత సమస్యలకు నేటి సమావేశం శుభంకార్డు వేస్తుందా..? లేక మరోసారి ఆశలకే పరిమితమవుతుందా..? అన్నది వేచి చూడాల్సిందే.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రామ్ కిషన్ రెడ్డి



**సారంగాపూర్, జూన్ 24,ప్రజా జ్యోతి** మండలంలోని ప్యారమూర్ గ్రామంలో సుంకరి వసంత అనే మహిళ గత మూడు రోజుల కింద బీరవెల్లి కాల్వ మధ్య ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని రోడ్డు ప్రమాదంలో మరణించన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం ఇంచార్జ్ రామ్ కిషన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించరు.ఇటీవల వైకుంఠాపూర్ గ్రామానికి చెందిన లగ్గం జగదీష్ దుబాయ్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం చేసారు. అదే గ్రామానికి చెందిన ఏరిండ్ల చిన్నయ్య మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి కూడా ఆర్థిక సహాయం చేయడం చేసారు.అలాగే వైకుంఠాపూర్ గ్రామానికి చెందిన మర్రి లస్మవ్వ మరణించడంతో వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించరు. ఆయన వెంట మండల కన్వీనర్ దేవి శంకర్. లక్ష్మణ్ చందా మండల కన్వీనర్ కృష్ణారెడ్డి. నిర్మల్ మండల కన్వీనర్ మహేష్ రెడ్డి, లక్ష్మి నారాయణ గౌడ్, మోతేవార్ లక్ష్మణ్. ప్యారామూర్ రవి. లక్ష్మణ్. నరేష్ గంగయ్య, బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సంఘ పిలుపుమేరకు తహసిల్దార్ వినతి పత్రం

**స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి**

**సంఘం అధ్యక్షుడు కదార్ల వెంకటేష్**



**ఖానాపూర్ జూన్ 24 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ పట్టణ స్వర్ణకారులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని స్వర్ణకార సంఘ అధ్యక్షులు కాదర్ల వెంకటేష్ అన్నారు రాష్ట్ర సంఘ పిలుపుమేరకు ఈనెల 24న మండల తాసిల్దార్లకు వినతిపత్రం సమర్పించాలన్న కార్యక్రమంలో భాగంగా వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు చిరు వ్యాపార సంఘం కార్మిక సంక్షేమ, స్వర్ణకారులు అందరికీ 50 సంవత్సరాలు పైబడిన వారికి గీత నేత కార్మికులకు ఇచ్చే విధంగా 5వెల రూపాయల పెన్షన్ మంజూరు చేయాలని స్వర్ణకార వృత్తిపరులకు స్వర్ణ పనిముట్లు సబ్సిడీ కింద అందజేయాలని జీవో 272ను సవరణ చేసి ప్రతిష్టాత్మకంగా అమలుపర్చి స్వర్ణకారులను దొంగ బంగారం రికవరీలో నుండి కాపాడాలని ముఖ్యంగా స్వర్ణకారులకు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ సుజాత రెడ్డికి అందజేశారు ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘ నాయకులు భిక్కునూరు ప్రవీణ్ ఎనుగంటి అజయ్ నరేష్ కోమోజి వేణుగోపాల్ రాజు శేషాద్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# పదవీ విరమణ వేళ రఘురామిరెడ్డికి ఘన సన్మానం

పదవీ విరమణ వేళ రఘురామిరెడ్డికి ఘన సన్మానం...



**మందమర్రి, జూన్ 24(ప్రజాజ్యోతి ):** త్వరలో పదవీ విరమణ చేయనున్న సింగరేణి జనరల్ మేనేజర్ (ఈఅండ్ఎం) అండర్‌గ్రౌండ్ మైన్స్ శ్రీ వై.రఘురామిరెడ్డికి బుధవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణతో పాటు ఏరియా ఉన్నతాధికారులు ఆయనను శాలువాతో సత్కరించి, సుదీర్ఘ సేవలను కొనియాడారు. జనరల్ మేనేజర్‌గా రఘురామిరెడ్డి, సంస్థ అభివృద్ధికి చేసిన విశేష సేవలను అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, కేకే ఏజెంట్ కాదిర్, ఎస్‌కే ఏజెంట్ సంతోష్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మత్తుకు బానిస కావద్దు జీవితాలను నాశనం చేసుకోవద్దు.ఎస్.ఐ ఉదయ్ కిరణ్





**జన్నారం,జూన్24(ప్రజాజ్యోతి)** విద్యార్థులు,యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలై తమ జీవితాలను,బంగారు భవిష్యత్తు ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ ఉదయ్ కిరణ్ అన్నారు. జన్నారం మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కు బుధవారం రోజున అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్.ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు విద్యార్థుల కు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచిగా చదువుకొని పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల అవగాహన వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి,సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)**గిరిజన విద్యార్థులకు నాణ్య మైన విద్యను అందించడమే ఐటిడిఏ లక్ష్యం అని ప్రాజెక్టు అధికారి మంద మకరందం స్పష్టం చేశారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రా జెక్టు అధికారి మంద మకరందు గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలికలు) ఉట్నూర్‌ను సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలు, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న మ ధ్యాహ్న భోజనాన్ని స్వయం గా పరిశీలించి, అమలవుతు న్న మెనూ వివరాలను తెలు సుకున్నారు. విద్యార్థులతో నే రుగా మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, పరిమాణం, ఇ తర సౌకర్యాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. తదుపరి ఉపాధ్యాయులు సిబ్బందితో ప్రత్యేక సమావే శం నిర్వహించిన ప్రాజెక్టు అ ధికారి, విద్యార్థుల విద్యా నా ణ్యతను మరింత మెరుగుప రచడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. విద్యార్థు లకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు అనుసరిస్తున్న విధానాలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని నిరం తరం పర్యవేక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. వ ర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వసతి గృహాలు, తరగతి గదులు, ఇతర భవనాల్లో మ ర మ్మత్తులు అవసరమైతే వెంటనే చేపట్టి విద్యార్థులకు ఎ టువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పాఠశాల వంటగది ఆవరణలో ఆకు కూరగాయల నర్సరీ ని ఏర్పా టు చేసి పోషకాహార అవస రాలకు ఉపయోగపడేలాచూ డాలని తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నిల్వనీటి కారణంగా దోమలు వ్యా ప్తి చెంది విద్యార్థులకు డెం గ్యూ, మలేరియా వంటి వ్యా ధులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ కా కుండా పారిశుద్ధ్య చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయా లని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. గిరిజన వి ద్యార్థుల సమగ్ర అభివృద్ధి కో సం విద్య, ఆరోగ్యం, పోషకా హారం, భద్రత అంశాల్లో రాజీ లేకుండా పనిచేయాలని ప్రాజె క్టు అధికారి స్పష్టం చేశారు.

## ఐఐటీలో సీటు సాధించిన ప్రవళిక వైష్ణవి

-- సన్మానించిన సర్పంచ్, ఎంఈఓ



**నేరడిగొండ, జూన్ 24 (ప్రజా జ్యోతి):**మండలంలోని వడూరు గ్రామానికి చెందిన ప్రవళిక, వైష్ణవి బాసర ఐఐటీలో సీటు సాధించి తమ గ్రామానికి, మండలానికి గర్వకారణంగా నిలిచారు ఈ సందర్భంగా వారిని గ్రామ సర్పంచ్ ఆడేపు శ్రీకాంత్, మండల విద్యాధికారి (ఎంఈఓ) భూమారెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆడేపు శ్రీకాంత్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి ప్రవళిక, వైష్ణవి పట్టుదలతో చదివి ఐఐటీలో సీటు సాధించడం అభినందనీయ మని, ఇది తమ గ్రామానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం ఎంఈఓ భూమారెడ్డి మాట్లాడుతూ.. చదువుపై ఉన్న ఆసక్తి, శ్రద్ధతో కష్టపడి సీటు సాధించిన విద్యార్థినులు భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉషన్న, సోయల్, లక్ష్మణ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు మరియు విద్యార్థినుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మంచి మార్పుతో నవజీవనం సాగించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నషా ముక్త్ భారత్ సప్తాహ్‌లో భాగంగా డవ్ పునరావాస కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)**మంచి మార్పుతో నవజీవనం సాగించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం నషాముక్త్ భారత్ సప్తాహ్‌లో భాగంగా డవ్ పునరావాస కేంద్రాన్ని సందర్శించి, వివిధ విభాగాలను, మెడికల్ క్యాంప్‌ను, 'టీబీ ముక్త్ భారత్' కా ర్యక్రమంలో భాగంగా నిర్వహి స్తున్న ఎక్స్-రే క్యాంప్‌ను యనస్వయంగా పరిశీలించారు. అంతకు ముందు కేంద్రంలోని సిబ్బందిని, చికిత్స పొందుతున్న రోగులను వైద్య సేవలపై వివరాలను అడిగితె లుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ "గతంతో పోలిస్తే ప్రస్తుతం ఈ కేంద్రం విశాల మైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో బాగుందనీ, బాధితులు వాకింగ్ చేయడానికి, స్వే చ్ఛగా ఉండడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఇక్క డికి వచ్చిన వారు 30 రోజుల్లోనే మంచి మార్పు సాధించడం సంతోషకరమని, మీకుటుంబం, ముఖ్యంగా మీ పిల్లల చదువులు, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం మీరంతా వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలనీ సూచించారు. మీరు బాగుంటేనే మీ కుటుంబం, పిల్లలు బాగుంటుందని, ఇక్కడి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత మళ్లీ పాత అలవా ట్ల జోలికి వెళ్లకుండా, లభించిన నవజీవనంతో సమాజంలో మంచిపనులు చేస్తూ బాధ్య తాయుతంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూడవ్ కేంద్రం ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధి కారి సాధన, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వైద్యులు సుమలత, విజయ్, కేంద్రం నిర్వాహకులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొ న్నారు.

## తాండ్ర(జి ) గ్రామంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగహన కార్యక్రమం



సారంగాపూర్,జూన్ 24,(ప్రజా జ్యోతి నిర్మల్ జిల్లా డా,, జానకీ షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు తాండ్ర (జి )గ్రామంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించరు.గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.నేటి యువత మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. యువత ఎటువంటి దురాలవాట్లకు బానిస కాకుండా ఉండాలని చెప్పారు..ఈ కార్యక్రమంలో తాండ్ర(జి )సర్పంచ్ వెన్నెల నర్సయ్య, పంచా యతీ సెక్రటరీ రఘు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## దేశ సమైక్యత కోసం ప్రాణ త్యాగం చేసిన మహానేతకు ఘన నివాళి

**అదిలాబాద్‌లో శ్యామా ప్రసా ద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు**

**ఎమ్మెల్యే పాయల్ శంకర్ శ్రద్ధాంజలి**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)** దేశ సమగ్రత, సమైక్యత కోసం ప్రాణత్యాగం చేసిన మహా నేత శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కొనియా డారు.అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్ర మంలో ఎమ్మె ల్యే పాయల్ శంకర్ పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ దేశ సమైక్యత, ఏక త్వం కోసం తన ప్రాణాలను అర్పించిన మహానుభావుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశంలో రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు ఉండ కూడదనే సిద్ధాంతంతో కాశ్మీర్ విష యంలో ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయి గా నిలిచి పోయిందన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలగ న్న “ఒకే దేశం ఒకే విధానం ఒకే చట్టం” అనే లక్ష్యాన్ని నేడు కేంద్ర ప్రభుత్వం సాకారం చేసిందని తెలిపారు. ముఖ్యంగా భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 370 రద్దు ద్వారా ఆయన ఆశయాలకు నిజమైన నివాళి అర్పించామని పేర్కొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ భౌతికంగా మన మధ్య లేక పోయినా, ఆయన ఆలోచనలు, దేశభక్తి, త్యాగస్ఫూర్తి ప్రతి బీజేపీ కార్యకర్తకు స్ఫూర్తిదాయ కమని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతికార్యకర్త అంకితభా వంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో బీజే పీ నాయకులు, జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద. జోగు రవి, దయా కర్, దినేష్ మాటోలియా, ధోని జ్యోతి, రాకేష్, భీమ్సేన్ రెడ్డి, దత్తు, స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.పార్టీ కార్యకర్తలు పాల్గొని శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకున్నారు.

# బోగస్ ప్రకటణలతో బిజెపి నేతలు మోసం

### ఆదిలాబాద్ ప్రజలకు ఎంపీ, ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

### మాజీ మంత్రి జోగు రామన్న



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ లో ఎయిర్‌పోర్ట్, ఇండస్ట్రియల్ కారిడార్, సీసీ ఐ పరిశ్రమ అంశాలపై ప్రజల కు స్పష్టత ఇవ్వకుండా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఆదిలాబా ద్ ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ మంత్రి జోగు రామ న్న ఆరోపించారు. ఈ అంశాలపై వెంటనే జిల్లా ప్రజలకు క్ష మాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.బుధవారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జోగు రా మన్న మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ కారిడార్, సీసీఐ పరిశ్రమ, ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలపై స్పష్టమైన ప్రణాళికలు లేకపోయినా అభివృద్ధి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేవలం కమిషన్ల కోసమే ఈ ప్రాజెక్టుల పేరుతో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ కేంద్ర మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం ఎ యిర్‌పోర్ట్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వలేకపోతున్న సమయం లో స్థానిక ఎమ్మెల్యే డీపీఆర్ పూర్తయిందంటూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడు తున్నారని అన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధికి తాము ఎ ప్పుడూ స్వాగతం పలుకుతామని, అయితే బూటకపు హామీలతో ప్రజలను మోసం చేయడాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీసీఐ పరిశ్రమను పునఃప్రారంభిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి, ప్ర స్తుతం ప్రైవేటీకరణ దిశగా అ డుగులు వేయడం జిల్లా ప్రజ లను మోసం చేయడమేనని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లోనే ఆదిలాబాద్‌ను ఏరోస్పేస్ జోన్‌గా గుర్తించి, ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రూ. 8 కోట్లతో సర్వేలు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే రేణుక సిమెంట్ పరిశ్ర మ ఏర్పాటుకు రూ. 4 కోట్లతో సర్వేలు నిర్వహించగా వాటిని అడ్డుకున్నది ప్రస్తుత బిజెపి నాయకులేనని ఆరోపించారు.ఒకవైపు ఎంఓయూలు జరగదు, మరోవైపు డీపీఆర్‌లలో స్పష్టత లేకపోయినా లైన్ క్లియర్ అయిందంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని మండి పడ్డారు. ఎన్నికల ముందు సీసీఐ పరిశ్రమ ప్రారంభిస్తాం ని చెప్పిన కేంద్ర నాయకులు ఇప్పుడు దానిని ప్రైవేటీకరం చడంపై సమాధానం చెప్పాల ని డిమాండ్ చేశారు. ఆదిలా బాద్ ప్రజలకు పూర్తి వివరా లు వెల్లడించే వరకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్లు, కా ర్యాలయాల ను బీఆర్ఎస్ పార్టీ తరఫున ముట్టడిస్తామ ని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో పట్టణ అధ్యక్షుడు అ జయ్, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, అన్నెల వసం త్, కొండ గణేష్, దమ్మపాల్, దివిటి రాజు, ఆసిఫ్, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి





**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**రిమ్స్ ఆసుపత్రి ఆకస్మిక త నిఖీ**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా వైద్యాధి కారులను ఆదేశించారు. బుధవారం స్థానిక రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, ఈఎన్‌టీ, యూరాలజీ, డ్రగ్స్, ఈసీజీ ఇతర విభాగాలను సందర్శించి, అనంతరం ఆసుపత్రి కి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి ఎక్స్రే, ఈసీజీ పరీక్షల సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, రిమ్స్‌లో న్యూరో సర్జరీ, యూరాలజీ, సైకియాట్రీ, ఈ ఎన్ టీ వంటి ఖరీదైన స్పెష లిస్ట్ సేవలు ఉచితంగా అందు తున్నాయని, జిల్లా ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా వైద్య సేవలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. ఆసు పత్రిలో రోగులు సైతం ఆవర ణను శుభ్రంగా ఉంచేలా ఆడియో సందేశాల ద్వారా అవగా హన కల్పిస్తున్నామని తెలిపారు. తనిఖీలో కొన్ని చిన్నపాటి లోపాలను గుర్తించామని, ప్రొ ఫెసర్లు, హెచ్‌ఓడీలు తప్పని సరిగా విధుల్లో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆర్ఎమ్ఓ ను ఆదేశించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా సీ డీ ఎస్ ద్వారా లేదా ప్రైవేట్ టెండర్ల ద్వారా అవసరమైన మందు లన్నీ కొనుగోలు చేసి రోగులకు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. వైద్య సేవ ల్లో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా రిమ్స్ డైరెక్టర్ దృష్టికి లేదా తన దృష్టికి తీసుకు రా వచ్చన్నారు. ప్రస్తుత వర్షాకా లం నేపథ్యంలో పీడియాట్రీషి యన్, ఓబిజి సేవలు అత్యం త కీలకమైనందున, హాస్పిటల్ నిధుల ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన వైద్యులను నియమించినట్లు వెల్లడించారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గు న్యా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి ప్రజలు తమ ఇళ్లలో ప్రతి శు క్రవారం తప్పనిసరిగా ‘డ్రై డే’ పాటించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ఆర్ఎంఓ చంపత్ రావు, పర్యవేక్షకులు నరేందర్ వైద్యులు రాహుల్ పుష్కర్, ఇ తర వైద్యులు, సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతామని సంతకాల సేకరణ

**డ్రగ్స్,మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి**

**“వాల్ ఆఫ్ ప్రామిస్”పై సంతకం చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**

**డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు కార్యాలయాల ఎదుట సంతకాల సేకరణ**

**యాంటీ డ్రగ్స్ సోల్జర్‌గా పోరా డుతామని సెల్ఫీ మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు తెలియజేయాలి**

**ఉత్సాహంగా పాల్గొన్న యువ త, విద్యార్థులు, ప్రజలు, పోలీసు అధికారులు, ప్రజా ప్రతిని ధులు సిబ్బంది**







**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతామని ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో “వాల్ ఆఫ్ ప్రామిస్”లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొని సంతకం చేశారు. గంజాయికి దూరంగా ఉండాలని, గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణానికి కృషి చేస్తానని తన ప్రతిజ్ఞను నమోదు చేశారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తమ మద్దతు ను తెలియజేసి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడు తూ, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలపై సమాజమంతా కలిసి పోరా డాలని, డ్రగ్స్ లేని ఆరోగ్యకర మైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్య వహరించాలని పిలుపుని చ్చారు. ఈ “వాల్ ఆఫ్ ప్రామి స్” పై సంతకం చేసిన ప్రతి ఒక్కరూ గంజాయి రహిత సమాజ నిర్మాణానికి పోరాడుతూ, గంజాయి బారిన పడిన వారి సమాచారం, గంజాయి పై ఉన్న సమాచారాన్ని పోలీ సులకు తెలియజేస్తామనే బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి బారిన పడిన యువతకు సరైన చికిత్స ద్వారా నయం చేయవచ్చుని, పునరావాస కేంద్రాల ద్వారా నయం చేసి తిరి గి సాధారణ జీవితాన్ని గడిపేలా పోలీసు యంత్రం కృషి చే స్తుందని, తల్లిదండ్రులు డ్రగ్స్ బారిన పడిన వారిని చికిత్స కేంద్రాలకు తరలించి చికిత్సను అందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ సోల్జర్‌గా పోరాడుతామని డ్రగ్స్ వ్యతిరేకంగా పోరాడుతామని ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర కేంద్రం వద్ద ఫోటోలను దిగిత మసామాజిక మాధ్యమాల కేంద్రాలలో పొందుపరచాలని జిల్లా ఎస్పీ సూచించారు. మీడియా ప్రతినిధులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతామని సంతకాలు చేసి, యాంటీ డ్రగ్ సోల్జర్‌గా ఏర్పాటు చేసిన పోస్టర్ల వద్ద చాయ చిత్రాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డి ఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఇన్స్పెక్టర్లు కె ఫణిదర్, ప్రణయ్ కుమార్, ఎస్ ఐలు అశోక్, సంజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమం దిశగా ప్రభుత్వం కృషి



**రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా**



**ఆదిలాబాద్ బ్యూరో,జూన్ 24, (ప్రజా జ్యోతి)**రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమ అందించగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. బుధవారం హై దరాబాద్ లోని ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో గిరిజన ప్రజల ఆరోగ్య ఫలితాల మెరుగుదల అంశంపై నిర్వ హించిన సమావేశానికి ప్రభు త్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, ఇతర ఉన్న తాధికారులతో కలిసి హాజర య్యారు. ఈ సమావేశానికి ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు హాజరై ఉట్నూర్ పరిధిలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ఇతర అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడు తూ గిరిజన ప్రజల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో తలెత్తిన లోపాలు, ఆరోగ్య ఫలితాల మెరుగుదల అంశాలపై సమావేశంలో చర్చించడం జరిగిందని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గిరిజన గూడాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణపై సూ చించడం జరిగిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి గిరిజన ప్రజల సంక్షే మం కోసం చేపట్టిన కార్యక్ర మాలను అధికారుల సమన్వ యంతో అమలు చేయడం జ రుగుతుందని తెలిపారు. అర్హులైన గిరిజన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, విద్య, వైద్య రంగాల అభివృద్ధి, గిరిజ న ప్రాంతాలకు రవాణా సౌక ర్యం కల్పించేలా రహదారుల అనుసంధానం, గిరిజన పిల్లల ఆరోగ్యం దృష్ట్యా పోషణ్ అభి యాన్ అమలు, ప్రధాన మంత్రి జుగా, జన్ మన్ ఇతర అనేక కార్యక్రమాల అమలుపై నిరంతరం పర్య వేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సమగ్ర గిరిజన అభివృద్ధి అధికారి రాహుల్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంకీ రెస్క్యూ సెంటర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**సారంగాపూర్, జూన్ 24,(ప్రజా జ్యోతి** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మండలం చించోలి (బి) గ్రామంలోని గండిరామన్న హరితవనంలో ఏర్పాటు చేసిన మంకీ రెస్క్యూ సెంటర్‌ను పరిశీలించారు. కోతుల పట్టివేత, పునరావాసం, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు పట్టుకున్న కోతుల సంఖ్య, అందుబాటులో ఉన్న మంకీ క్యాచర్స్, కోతుల తరలింపు మరియు పునరావాస ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల సమస్యను సమర్థవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమా జం కోసం నేడు భారీ అవగా హన ర్యాలీ

**ప్రజలందరూ పాల్గొనాలి**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)**‘నషా ముక్త్ భారత్ అభియాన్’ ‘వికసిత్ భారత్‌కీ పెహ చాన్’ కార్యక్రమాల్లో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గురువారం (జూ న్ 25) జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపా రు. తెలంగాణ యాంటీ నా ర్కోటిక్స్ బ్యూరో, జిల్లా సంక్షే మ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ “న షా ముక్త్ సప్తాహ్” ర్యాలీ ఉద యం 8 గంటలకు ఐబీ స్టేడి యం నుంచి ప్రారంభమై జెడ్పీ హాల్ వరకు కొన సాగుతుంద న్నారు.“మత్తు పదార్థాలకు నో చెప్పండి, జీవితానికి ఎస్ చె ప్పండి” అనే నినాదంతో యువతలో చైతన్యం కల్పించడం, మాదకద్రవ్యాల సరఫరా చక్రా న్ని తెంచడం, వ్యవస్థీకృత నే రాలను అరికట్టడం ఈ కార్యక్ర మం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.“ఆరోగ్యకరమైన యువత బలమైన సమా జంఉజ్వల భవిష్యత్తు” అనే సందేశంతో నిర్వహించే ఈ అవగాహన ర్యాలీలో యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొ ని మాదకద్రవ్యాల రహిత వి కసిత భారత నిర్మాణానికి తో డ్పడాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

## ఖానాపూర్లో వివాహ కార్య క్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఖానాపూర్ జూన్ 24( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిటిసి కౌన్సిలర్ దంపతులు తొంటి రాధా శ్రీనివాస్‌ల కుమార్తె వివాహానికి హాజరై నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. వేద పండితుల గృహప్రవేశంలో పాల్గొన్న బొజ్జు పటేల్ ఖానాపూర్ వేద పండితులు చక్రపాణి వాసుదేవా చార్యులు నరసింహమూర్తిల నూతన గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు

# ఆదిలాబాద్ అభివృద్ధికి గేట్ వేగా ఎయిర్ పోర్ట్ త్వరలో శంకుస్థాపన

### ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఢిల్లీ సమావేశంలో కీలక ఒప్పందం

### భూసేకరణ పూర్తైతే ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు

### రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ పనులు త్వరలో ప్రారంభం 2 వేల మందికి ఉపాధి అవకా శాలు

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కీలక మలుపు కానుందని, దీనికి సం బంధించిన తాజా పరిణామా లను ప్రజలకు వివరించేందుకే ఈ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. మంగళవారం ఎమ్మె ల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుపై ప్రజల్లో ఉన్న అనుమానాలకు తెరదించుతూ, సోమవారం ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన సమావేశంలో కీలక అవగాహన కుదిరిందన్నారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్ట్ రావడం గొప్ప అవకాశమని, జిల్లాలో మరింత అభివృద్ధికి ఇది దోహద పడుతుందని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ కోసం ఇప్పటికే గు ర్తించిన 1,880 ఎకరాలకు అదనంగా మరో 400 ఎకరాల ను రాష్ట్ర ప్రభుత్వం సేకరించ నున్నట్లు తెలిపారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు 80 ఎకరాలు తక్షణ మే కేటాయించి టెర్మినల్ భవ నం, విమాన రాకపోకలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఒప్పందం కుదిరిందన్నారు. హైటెన్షన్ విద్యుత్ లైన్ల మార్పిడి కోసం రూ.340 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.600 కోట్ల వ్యయానికి రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. భూసేకరణ నిధుల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్పష్టం చేశారని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ ద్వారా ప్రయాణికుల రాకపోకలతో పాటు కార్గోసేవలు కూడా అందుబాటు లోకి వస్తాయని, జిల్లాలో ఉత్పత్తయ్యే వస్తువులను దేశ విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు పెరుగు తాయని అన్నారు. విమానా ల పార్కింగ్ కోసం ప్రత్యేక హ్యాంగర్లు ఏర్పాటు చేసే ప్రతి పాదన కూడా పరిశీలనలో ఉందని తెలిపారు. భూసేకర ణ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు, రక్షణ శాఖ ప్రతినిధులు ఆదిలాబాద్‌కు వచ్చి ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకు స్థాపన చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా ఉన్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఆదిలాబాద్



అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అనవసర రాజకీయాలు చేయకుండా ప్రతిపక్షాలు కూడా సహకరించాలని ఆయన కో రారు. జిల్లాకు మేలు చేసే కార్యక్రమాల్లో అందరూ భాగ స్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి త్వరలో శంకుస్థాపన,**

అదిలాబాద్ రూరల్ మండలంలోనిరామాయి రాంపూర్ మధ్య ప్రతిపాదిత రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. అన్ని అనుమతులు దాదాపు పూర్తయ్యాయని, అధికారికంగా పనులు ప్రారంభ మయ్యే అవకాశం ఉందన్నారు. సుమారు ఒకటి నుంచి రెండు సంవత్సరాల వ్యవధిలో ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించే ల క్ష్యంతో ముందుకు సాగుతు న్నామని చెప్పారు. ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 2,000 మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. అలాగే ఆదిలాబాద్‌లో మరిన్ని సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైతే సున్నపురాయి నిల్వలున్న ప్రాంతాలను టెండర్ల ద్వారా పరిశ్రమలకు అందించే అంశంపై కేంద్ర ప్రభు త్వం ప్రాథమిక స్థాయిలో చ ర్చలు జరుపుతోందని ఎమ్మె ల్యే తెలిపారు. దీంతో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జోగు రవి,పోషాన్న, ధోని జ్యో తి, దయాకర్, నరేష్, విలాస్, రాకేష్, బీన్స్ రెడ్డి, శివ, గోపీ, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం నిధులు తీర్మానం చేయకపోవడం దురదృష్టకరం

**కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆరోపణ**

**ఖానాపూర్ జూన్ 24 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలో ఇటీవల రోడ్డు విస్తరణ కార్యక్రమాలపై ప్రజా పౌరుల పేరా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పనులు చేయాలంటూ ఆందోళన చేస్తున్న వాళ్లని స్పందించి పనులు చేస్తామని సంజాయించడం జరిగింది ఈ మేరకు బుధవారం జరిగిన సాధారణ సమావేశంలో 20 లక్షల రూపాయలు అట్టి పనులకు కేటాయించాలని కోరితే తిరస్కరించడం శోచనీయమని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించారు ఈ మేరకు రోడ్డు విస్తరణ విషయమై ప్రజలకు వివరణ చైర్మన్,వైస్ చైర్మన్ , మద్దతు పలిగిన మిగతా కౌన్సిలర్ల పైనే బాధ్యత ఉందని అన్నారు బుధవారం జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కారు అద్దెకు గాని 33వేల రూపాయలు నెలకు కేటాయించడం అన్యాయమన్నారు కొత్త మున్సిపాలిటీ చిన్న మున్సిపాలిటీ అయినందున గతంలో ఒకే టర్ములో ఇద్దరు మున్సిపల్ చైర్మన్‌గా చేసిన అంకం రాజేందర్ రాజుర చిన్నం సత్యనారాయణలు నెలనెల మెయింటెనెన్స్ కింద రూపాయి తీసుకోలేదని సొంత వాహనాల్లోనే తిరిగామని గుర్తు చేశారు ఈ విషయం మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రస్తుత కౌన్సిలర్ రాజురా సత్యం తెలియజేసిన వినిపించుకోకపోవడం ఖానాపూర్ పట్టణ ప్రజలకి శాపంగా మారింది అన్నారు అలాగే తడి చెత్త పొడి చెత్త పట్టణంలో సేకరించే వాహనాల్లో డీజిల్, పెట్రోల్ల కోసం కౌన్సిలర్ నిర్వహిస్తున్న ఒక బంకుకు అడ్వాన్సుగా1 లక్ష 3వెల రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకొని డీజిల్ పెట్రోల్ సరాపర చేయకపోవడం పైగా కమిషనర్ ఫోన్ లేపకపోవడంతో వేరే బంకులు తన సొంత ఖర్చులతో తడి చెత్త పొడి చెత్త వాహనాలను సక్రమంగా పట్టణంలో తిరిగిలా చేశారని ఆరోపించారు అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్న చైర్మన్ వైస్ చైర్మన్ వారికి మద్దతిస్తున్న కౌన్సిలర్లకు పట్టణ ప్రజలే సరైన సమయంలో స్పందిస్తారని రానున్న రోజుల్లో అభివృద్ధి నిరోధకులు ఎవరో ప్రజలే గుర్తిస్తారని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు రాజుర సత్యం నిమ్మల రమేష్ గొర్రె తిరుమల గంగాధర్ మేష పోసాని సాజిదా బేగం జమాల్ కురిసిలు విలేకరులతో సమావేశ అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు అన్నారు



# ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ప్రత్యేక సర్వే

**జూన్ 25 నుంచి జూలై 24 వ రకు ఎస్ఐఆర్ కార్యక్రమం**
**ఇంటింటికీ వెళ్లి వివరాలు సేక రించనున్న బీఎల్‌వోలు**
**అపోహలు నమ్మొద్దుప్రజలంతా సహకరించాలి**
**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)** ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, తప్పుల రహితంగా రూపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటిగ్రేటెడ్ రివిజన్-ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభిస్తు న్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ కా ర్యక్రమం జూన్ 25 నుంచి జూలై 24, 2026 వరకు కొనసా గుతుందని వెల్లడిం చారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడి యా ప్రతినిధులతో నిర్వహిం చిన సమావేశంలో ఆయన ఎస్ ఐఆర్ ప్రక్రియకు సంబం ధించిన వివరాలను వెల్లడిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక సవర ణ కార్యక్రమం లో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీ ఎల్‌వోలు) ప్రతి ఇంటిని సంద ర్శించి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఓటర్ల కో సం ముందుగానే ముద్రించిన ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి వాటిని పూర్తి చేయ డంలో అవసరమైన సహాయా న్ని అందిస్తారని చెప్పారు. ఓ టరు జాబితాలో పేర్లు ఉన్న వారు తమ వివరాలను ధృవీ కరించుకోవడంతో పాటు అవ సరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఒక వేళ 2002 నాటికి ఓటు హక్కు లేకపోయినా, తమ తల్లి దండ్రులు లేదా తాతముత్తాత ల ఓటరు వివరాల ఆధారంగా సంబంధిత ఫారాలను పూర్తి చేసి సంతకం లేదా బ్రొటన వేలు ముద్రతో అధికారులకు అందజేయ వచ్చన్నారు. ఓట ర్లు తమ వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా కూడా స్వయంగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్దడంతో పాటు, మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్న డూప్లికేట్ ఓట్లను తొలగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్స రాలు పూర్తిచేసుకునే అర్హులై న ప్రతి యువతీ, యువకుడి పేరును తుది ఓటర్ల జాబితా లో చేర్చడమే ప్రధాన లక్ష్య మన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఓట్లు తొలగిపోతాయనే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చే శారు. ఉదయం 8 గంటల నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే ప్రారంభిస్తారని, ప్రజలం దరూ పూర్తి సహకారం అం దించి తమ ఓటు హక్కును భద్రపరచుకోవాలని కోరారు. ఏవైనా సందేహాలు లేదా సమాచారం కోసం ఎన్నికల సంఘం టోల్‌ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించవచ్చని, అలాగే ప్రతి మండల తహసీల్దార్ (ఎం ఆ ర్ వో) కార్యాలయంలో ప్రత్యే క హెల్ప్‌డెస్కులు అందుబాటు లో ఉంటాయని కలెక్టర్ తెలి పారు. ఈ సమావేశంలో అద నపు కలెక్టర్ ఆర్ ఎస్ చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఆర్డీవో జగ దీశ్వరరావు, డిపిఆర్ఓ విష్ణు వర్ధన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం అధికారులు నలందప్రియ, ప్రింట్, ఎలక్ట్రా నిక్ మీడియా ప్రతినిధులు త దితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు పోయాకే స్పందిస్తారా?
# జాతీయ రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

**--కుప్టి వాగు పాత బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన ప్రహరీ గోడ నిర్మాణం**
**--రక్షణగా కేవలం డ్రమ్ములు మాత్రమే.. ప్రయాణికుల బెంబేలు**






**నేరడిగొండ జూన్ 24 (ప్రజా జ్యోతి ):**"అయ్యా.. ప్రాణాలు పోయాకే పట్టించుకుంటారా?" అంటూ జాతీయ రహదారి (44) పై ప్రయాణించే వాహనదారులు, స్థానిక ప్రజలు అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రాంతాన్ని చూస్తూ కూడా అధికారులు కళ్లుండి కనపడనట్టు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**డ్రమ్ములే రక్షణగా 300 మీటర్ల రోడ్డు..**

మండలంలోని కుప్టి ప్రాంతంలో గల వాగుపై ఉన్న పాత బ్రిడ్జి ప్రహరీ గోడ నిర్మాణాన్ని గత వారం, పది రోజుల క్రితం అధికారులు పూర్తిగా తొలగించారు. ఆ స్థానంలో శాశ్వత గోడను నిర్మించాల్సింది పోయి, కేవలం డ్రమ్ములను మాత్రమే అడ్డంగా పెట్టారు. దాదాపు 300 మీటర్ల పొడవునా రోడ్డు పక్కన ఈ డ్రమ్ములను అమర్చడం గమనార్హం.

**రాత్రి వేళల్లో పెను ప్రమాదం!**

ఈ రహదారి జాతీయ రహదారి 44 కావడంతో రాత్రి వేళల్లో లారీలు, బస్సులు, బైకులు అత్యంత వేగంతో ప్రయాణిస్తుంటాయి. ఎలాంటి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకుండా, రేడియేటర్లు లేదా హెచ్చరిక బోర్డులు లేకుండా కేవలం డ్రమ్ములు మాత్రమే పెట్టడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి పూట వాహనాలు కాస్త అదుపు తప్పినా నేరుగా లోతైన వాగులోకి పడిపోయే

**అధికారులు నిర్లక్ష్యం వీడాలి..**

కాంట్రాక్టర్లు, నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించక ముందే ఉన్న తాధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు. వెంటనే ఆ డ్రమ్ము లను తొలగించి, అక్కడ పటిష్టమైన ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక అధ్యాపకుల నియామకం

**27న ధృవపత్రాల పరిశీలన, డెమో తరగతులు**
**మంచిర్యాల జిల్లాలో మొత్తం 32 ఖాళీలు**

**మంచిర్యాల, 24, జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక అధ్యాపకులు, ఉపాధ్యాయుల నియామకా నికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారిణి కోటూరి రామ కళ్యాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు . జిల్లాలోని తొమ్మిది తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు ఆర్ట్స్ కళాశాలల్లో ఉన్న ఖాళీల మేరకు తాత్కాలిక పద్ధతిలో జూనియర్ లెక్చరర్లు, పీజీటీలు, టీజీటీలు, స్పెషల్ టీచర్ల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో బోధన నిర్వహించేందుకు ఈ నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు ఈ నియామక ప్రక్రియలో భాగంగా జూన్ 27వ తేదీ శనివారం రోజున లక్సెట్టిపేటలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాల (బాలికలు)లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వెంటనే తరగతి బోధన పరీక్ష (డెమో క్లాస్) నిర్వహించనున్నట్లు వివరించారు .జూనియర్ లెక్చరర్, పీజీటీ పోస్టులకు యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులతో పీజీ డిగ్రీతో పాటు బీఈడ్ అర్హత తప్పనిసరి కాగా, టీజీటీ పోస్టులకు సంబంధిత బీఎస్సీ, బీఏ లేదా బీకాం డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో పాటు బీఈడ్ అర్హత ఉండాలన్నారు. రెసిడెన్షియల్ విద్యా బోధనపై అవగాహన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి బయోడేటా, విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. జూనియర్ లెక్చరర్లకు నెలకు రూ.23,400, పీజీటీలు, టీజీటీలకు రూ.18,200, స్పెషల్ టీచర్లకు రూ.14,200 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో మొత్తం 32 ఖాళీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పురుషుల విభాగంలో జూనియర్ లెక్చరర్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ పోస్టులు, పీజీటీ మ్యాథమెటిక్స్, ఇంగ్లీష్, బయోసైన్స్, సోషల్ స్టడీస్ పోస్టులు, టీజీటీ బయోసైన్స్, ఆర్ట్ టీచర్, లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు .మహిళా విభాగంలో జూనియర్ లెక్చరర్ ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, సివిక్స్ పోస్టులతో పాటు పీజీటీ ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, టీజీటీ మ్యాథమెటిక్స్, బయాలాజికల్ సైన్స్, పీఈటీ, మ్యూజిక్ టీచర్, క్రాఫ్ట్ టీచర్, లైబ్రేరియన్, స్టాఫ్ నర్స్ పోస్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బాలికల విద్యాసంస్థల్లో విధులు నిర్వహించేందుకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని, నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఖాళీల్లో మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని, అవి సెలక్షన్ కమిటీ నిర్ణయానికి లోబడి ఉంటాయని తెలిపారు.

## మంగళంలో మహిళలకు ఉచిత మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం

**రేణిగుంట :** రాస్ జన శిక్షణ సంస్థాన్,తిరుపతి వారి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం మంగళం నందు మహిళలకు మగ్గం వర్క్ (ఆర్య వర్క్) పై మూడు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాస్ డైరెక్టర్ వి.నాగరాజు మరియు జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ బి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో వి.నాగరాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతివృత్తులు నేర్చుకుని అభివృద్ధి చెందాలని తెలియజేశారు.

# ఓటరు జాబితా సవరణలో రాజకీయ పార్టీల సహకారం కీలకం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)**జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా కోరా రు.బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు నమోదు కావడంతో పాటు, అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా జరగాలని ఆయన పేర్కొన్నారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు నిర్వహించే ప్రత్యేక సమగ్ర సవరణ కార్య క్రమంలో బూత్ స్థాయి అధికా రులు (బీఎల్వోలు) ప్రతి ఓట రుకు ఎన్యుమరేషన్ ఫారాల ను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను బీఎల్వోలు తిరిగి సేకరించి, అందులోని వివరాలను నిరంతరం యాప్‌లో నమోదు చేస్తారని వివరించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు చురుకుగా పాల్గొని, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించడంతో పాటు ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు.



ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొర పాట్లు, అభ్యంతరాలు లేదాలోపాలు తలెత్తకుండా రాజకీయ పార్టీలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.ప్రత్యేక సమగ్ర సవరణ కార్య క్రమాన్ని తహసీల్దార్లు, సూప ర్వైజర్లు, ఎన్నికల అధికారులు, జిల్లా యంత్రాం గం నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరుకు తన ఓటు హక్కు వినియో గించుకునే అవకాశం కల్పించ డమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందించేం దుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్మాణాత్మక సూచ నలు అందించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించేం దుకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, ఆర్డీవో జగదీశ్వరరావు, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళి క' నిరంతర ప్రక్రియగా కొనసా గాలి**

**జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు**

**జిల్లాలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక విజయవంతంజిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 24, (ప్రజా జ్యోతి)**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నిరంతర ప్రక్రియగా కొనసాగాలని జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హను మంతు పేర్కొన్నారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక' నిరంతర ప్రక్రియగా కొనసాగాలని జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కా ర్యక్రమంపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జి ల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన జిల్లా అధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు జరిగిన ఈ 99 రోజుల కార్యక్రమానికి సంబంధించి, ముఖ్యమంత్రి క్యాబినెట్ మంత్రుల ఆదేశాల ప్రకారం 10 విభాగాలలో నిర్దే శించిన పనులను అధికారు లు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా ప్రజల్లోకి తీసుకెళ్లారని వెల్ల డించారు. అయితే, ఈ 99 రో జుల కార్యక్రమం ముగిసిన ప్పటికీ, ఇక్కడితో ఇది ఆగిపో కుండా భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో నిరంతరం కొనసాగేలా పర్యవేక్షించడానికే ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియ మించిందని స్పష్టం చేశారు.గ్రామసభలు, మండల స్థాయి సమావేశాలలో ప్రజల నుండి సేకరించిన వ్యక్తిగత, కమ్యూ నిటీ సంస్థాగత వినతులను అన్ని శాఖల అధికారులు క్రోడీ కరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అనుభవాలు, ఫీడ్ బ్యాక్ ఆధారంగా ప్రతి శాఖ రాబోయే ఒకటి లేదా రెండు సంవత్స రాల కాలానికిగాను ఒక సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సీఎం, డిప్యూ టీ సీఎం, జిల్లా ఇంచార్జ్ మం త్రుల పర్యటనల సందర్భంగా జిల్లాలో జరిగిన శంకుస్థాపనలు, మంజూరైన జీవోలకు సం బంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులను త్వరిత గతిన గ్రౌండ్ చేయాలని, సీఎం ఇచ్చిన హామీలపై నిరంతరం ఫాలో-అప్ ఉండాలని అధికా రులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన అన్ని మంచి ఇనిషి యేటివ్స్ నిరంతరం కొనసాగే లా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, జిల్లాలోని 131 రె సిడెన్షి యల్ విద్యాసంస్థలను జిల్లా అధికారులు రెగ్యులర్‌గా సందర్శించి అక్కడి పరిశుభ్ర తను, ముఖ్యంగా విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత ను స్వయంగా పరిశీలించాలని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుం డి జూన్ 12 వరకు జిల్లాలో పారిశుధ్యం, ఆరోగ్యం, ఫైల్స్ క్లియరెన్స్ వంటి ప్రజా సమ స్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించిందనీ, జిల్లాలో ముఖ్యమంత్రి, ఉపము ఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి, డీజీపీల పర్యటనలు విజ యవంతంగా ముగిశాయయని, ఇంచార్జ్ మంత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, ఇందిర మ్మ ఇండ్ల పట్టాలు, కుట్టు మి షన్ల పంపిణీ జరగ్గా, డీజీపీ మత్తుపదార్థాల నియంత్రణపై యువతకు అవగాహన కల్పిం చారనీ వివరించారు.ముఖ్య మంత్రి ఇచ్చిన హామీల బుక్ లెట్‌తో పాటు జిల్లా సాధించిన విజయాలు, సంక్షేమ లబ్ధి, ఫిర్యాదుల పరిష్కారం నూతన ఆవిష్కరణలతో కూడిన "సమగ్ర ప్రగతి నివేదికను" త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్నారు. అనంతరం జిల్లా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకు సంబంధించిన బుక్ లెట్ ను ప్రత్యేక అధికారి ఆవిష్క రించారు. ఈ సమీక్ష సమీవేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రు, రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీ రావు పాటిల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పట్ల సీఎం చంద్రబాబు నాయుడు మానవతా దృక్పథం..

**మెమో-57 చారిత్రాత్మక నిర్ణయం..**

**హర్షం వ్యక్తం చేసిన చీర్ల కిరణ్**

**అర్హులైన టీటీడీ ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ అమలు చేయాలి..**

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్ పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెం.57 ద్వారా అర్హులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్ ) వర్తింపజేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపుతున్న మానవతా దృక్పథానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఎస్ అమలుకు ముందు నియామక ప్రక్రియ పూర్తయి, పరిపాలనా కారణాల వల్ల ఆలస్యంగా విధుల్లో చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. అదే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు (టీటీడీ)లో కూడా మేనేజ్‌మెంట్ పరమైన ఆలస్యాల కారణంగా 2004లో ఉద్యోగాలు పొందాల్సిన అనేక మంది అభ్యర్థులకు 2005లో నియామకాలు లభించాయని, దీంతో వారు పాత పెన్షన్ విధానానికి అర్హులైనా కొత్త పెన్షన్ విధానం (సిపిఎస్ ) పరిధిలోకి వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. మెమో-57 స్ఫూర్తిని కొనసాగిస్తూ, టీటీడీలో మేనేజ్‌మెంట్ ఆలస్యం వల్ల అన్యాయానికి గురైన అర్హులైన ఉద్యోగుల పరిస్థితిని కూడా ప్రభుత్వం మరియు టీటీడీ సానుకూలంగా పరిశీలించి, వారికి సైతం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని చీర్ల కిరణ్ కోరారు. రాష్ట్రంలో ఇంకా సిపిఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం దశలవారీగా పరిష్కరించి, ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు మరిన్ని చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## హిజ్రాల వేధింపులు అరికట్టండి ఐకాసా నాయకులు

**ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ పట్టణంలో వ్యాపారులు హిజ్రాల ఆగడాలతో అల్లాడిపో తున్నారు.. ఆళ్లగడ్డ పట్టణంలోని టీబీ రోడ్డులోని ప్రధాన రహదారిలో ఉన్న దుకాణదారుల వద్ద సోమవారం నుండి గురువారం వరకు ప్రతిరోజు ఎవరో ఒకరు హిజ్రాలు రావడం డబ్బులు అడగడం ఇవ్వని వారిపై అసభ్య పదజాలంతో దూషించి వారికి అంగాంగ ప్రదర్శనలు చేయించడం లాంటివి చేస్తూ ఉండటంతో దుకాణదారులు బెంబేలెత్తిపో తున్నారు. అంతేకాక ద్విచక్ర వాహనదారులు ఆటోల వద్ద పట్టణ శివారులలోని మలుపుల వద్ద మాటు వేసి వాహనాలను ఆపి వారి వద్ద నుంచి కూడా దౌర్జన్యంగా డబ్బులను డిమాండ్ చేస్తున్నారని ఐకాసా నాయకులు పెన్నెం సుధాకర్, బీరువాళ్ళ భాషాలు తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలో వ్యాపారాలు చేసుకోవాలంటే వీళ్లకు నజరానాలు ఇవ్వవలసి వస్తుందని అన్నారు.

## ఐటీ కారిడార్‌లో 5 ఎకరాల భూమికి హైడ్రా ఫెన్సింగ్

**రూ. వేయి కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా**

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా మంగళవారం కాపాడింది. సర్వే నంబరు 42లో మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే మార్గంలో అత్యంత విలువైన భూమిని కాజేయాలని కొంతమంది ప్రయత్నించారు. అక్కడ రెండు తాత్కాలిక షెడ్డులు వేసి ఒక గదిని కూడా నిర్మించారు. 5 ఎకరాల చుట్టూ రేకుల షీట్లతో ప్రహరీ కూడా నిర్మించే క్రమంలో హైడ్రాకు రెవెన్యూ శాఖ నుంచి ఫిర్యాదు అందింది. ఎన్నో ఏళ్లుగా ఈ భూమి తనదిగా చెబుతూ ఎవరినీ అటువైపు రానీయకుండా అడ్డుకుంటున్న పరిస్థితుల్లో శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. రెండు తాత్కాలిక షెడ్డులతో పాటు.. నిర్మించిన గదితో పాటు ఫెన్సింగ్‌ను హైడ్రా తొలగించింది.